

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో దోపిడీ
వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి రూ.వేల కోట్ల దోపిడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు తెరలేపారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. 8లో



టమాట కిలో రూ.18
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/21.2°
జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. పీజీఆర్‌ఎస్ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగే కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చని సూచించారు. ఇప్పటి వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించినా.. పరిష్కారం దొరకని వారు 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌కు రాకుండా ''me-ek-o-r-a-m.a p.g-o-v.i n''లో కూడా సమర్పించవచ్చన్నారు.

పోలీస్ కార్యాలయంలో...
పుట్టపర్తి టౌన్: పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అర్జీల ద్వారా తెలుపుకోవాలని సూచించారు.

'పెళ్లి పెటాకులు' కేసులో నిందితుడికి రిమాండ్

రాప్తాడురూరల్: పెళ్లి పెటాకులు చేసిన కేసులో నిందితుడు కటకటాలపాలయ్యాడు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి చెందిన ఓ యువతికి వివాహం నిశ్చయమైంది. శనివారం ముహూర్తం, ఆదివారం తలంబ్రాలు పెట్టుకున్నారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన వివాహితుడు బాలచంద్ర అంతకు ముందురోజు వరుడుకి ఫోన్ చేసి వధువుతో తనకు వ్యక్తిగతంగా పరిచయం ఉందని, అందుకు సంబంధించిన ఫొటో కూడా పంపుతానని ఇద్దరు ఉన్న ఓ ఫొటోను మొబైల్‌కు పంపాడు. అలాంటి యువతిని పెళ్లి చేసుకుంటాన్నంటే నీ ఇష్టం అంటూ ఫోన్ పెట్టేశాడు. దీంతో ఆందోళనకు గురైన వరుడు, అతని కుటుంబ సభ్యులు పెళ్లిని రద్దు చేసుకున్నారు. బాలచంద్ర ఫోన్‌కాల్‌తోనే పెళ్లి చెడిపోయిందని, తనకు ఆయనకు ఏమాత్రం పరిచయం లేదని, కేవలం కక్ష కట్టి తన పెళ్లి చెడగొట్టాడంటూ బాధితురాలు ఇటుకలపల్లి పీఎస్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. రెండు రోజుల గాలింపు అనంతరం ఆదివారం బాలచంద్రను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పుస్తకాభిలాషను పెంచడమే లక్ష్యం

అనంతపురం కల్చరల్: విద్యార్థులలో పుస్తకాభిలాషను పెంచి.. విజ్ఞాన సముపార్జన దిశగా ప్రోత్సహించడమే లక్ష్యమని గ్రంథాలయ అధికారులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'వియ్ లవ్ రీడింగ్' కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీరాములు, విశ్రాంత డీఎస్పీ హరి, డాక్టర్ అంకె రామలింగయ్య తదితరులు జ్ఞాపకశక్తి పెంచుకోవడం ఎలా అనే అంశంపై పలు సూచనలు, సలహాలు అందించారు. పిల్లల చేతనే కథలు చెప్పించడం, చదివించి, విశ్లేషణ చేయించడం గ్రంథాలయంలో కొనసాగిస్తామని గ్రంథాలయాధికారులు కమ్మన్న, గోవిందు అన్నారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ముత్యాలమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

బార్‌ను మరిపిస్తున్న బెల్టుషాపు



నాగేపల్లి క్రాస్ వద్ద నిర్వహిస్తున్న బెల్టు షాపు

లేపాక్షి: కోడిపల్లి పంచాయతీ పరిధిలోని నాగేపల్లి–కొత్తపల్లి రోడ్డులో బెల్టుషాపు.. బార్‌ను మరిపిస్తోంది. ఇక్కడ అన్ని రకాల బ్రాండ్‌ల మద్యం అందుబాటులో ఉంది. అనధికారికంగా విక్రయాలు జరుగుతున్నాయి. ఇక అనుబంధంగా ఉన్న రెస్టారెంట్‌లో కోరుకున్న ఫుడ్ సరఫరా చేసేస్తున్నారు. దీంతో ఈ బెల్టుషాపు మందుబాబులతో కళకళలాడుతోంది. మెయిన్ రోడ్డులోనే బెల్టు షాపు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం.



బెల్టు షాపు వద్ద వేసిన రెస్టారెంట్ బోర్డు

పడకేసిన పట్టణాభివృద్ధి

- ఏడాదిన్నరగా 'పుడా' పాలన అస్తవ్యస్తం
- కూటమి ప్రభుత్వంలో ఛైర్మన్‌ను నియమించని వైనం
- ఛైర్మన్ పదవికి ఆశావహులు ఎక్కువ కావడంతోనే జాప్యం
- 'పుడా' నిర్వీర్యంతో పుట్టపర్తి వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



పుట్టపర్తి ఏరియల్ వ్యూ

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం వచ్చాక 'పుడా' ఉనికి కోల్పోయింది. ఏడాది దాటినా ఛైర్మన్ నియామకం చేయలేదు. దీంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కార్యకలాపాలు స్తంభించిపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గిపోయింది. నగరం నుంచి మారుమూల గ్రామాల వరకు అభివృద్ధే లక్ష్యంగా పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) పరిధిని రాష్ట్ర ప్రభుత్వం విస్తరించింది. 1992లో ఆరు గ్రామాలతో ఏర్పడిన పుడాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రణాళికలో భాగంగా మౌలిక వసతులు, గృహ నిర్మాణ ప్రాజెక్టులను మరింత వేగవంతం చేసేందుకు పట్టణాల నుంచి పల్లెల వరకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆరు మండలాలకు విస్తరించారు. ఆ తర్వాత మరో ఐదు రెవెన్యూ గ్రామాలను చేరుస్తూ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా పుడా పరిధి 1417.13 చదరపు కిలోమీటర్లకు చేరింది. మొత్తం 82 రెవెన్యూ గ్రామాలు పుడా పరిధిలో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుడా పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. అక్రమాలకు తావు లేకుండా.. ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుతం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఛైర్మన్‌ను కూడా నియమించలేదు. అభివృద్ధి సంగతి పక్కన పెడితే.. అవినీతి పెరిగిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా అక్రమ కట్టడాలు మొదలయ్యాయి. కూటమి నేతల కనుసన్నల్లోనే భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిసింది.

ఛైర్మన్ పదవికి పోటాపోటీ..
పుడా ఛైర్మన్ పదవికి ఆశావహులు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. అయితే ఎవరికీ ఇవ్వకుండా మాజీ మంత్రి అడ్డుపుల్ల వేస్తున్నట్లు సమాచారం. తనకు ప్రొటోకాల్ పోతుందనే భయంతో జాప్యం చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఎవరికి ఇచ్చినా.. తనకు పోటీ వస్తారనే భయం కూడా ఉండటంతో అధిష్టానం వద్ద మాజీ మంత్రి ఏదో కారణం సాకు చూపుతూ అడ్డగిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏడాదిన్నర కాలంగా పుడా ఛైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. ఎంతో మంది ఆశావహులు.. తమకే వస్తుందనే ధీమాలో ఉండటం గమనార్హం.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
పుడా పరిధిలోనుంచి పుట్టపర్తి మున్సిపాలిటీని మినహాయించారు. దీంతో మున్సిపాలిటీలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అనుమతులు కొంత.. అక్రమం ఇంకొంత అన్న చందంగా మారింది. పుట్టపర్తి నుంచి పుడా కార్యాలయానికి వెళ్లే దారిలో సాయి సూపర్ బజారు పక్కన ఏడంతస్తుల భవనం ఉంది. కోకోనట్ గార్డెన్ దగ్గర యజమాని ఎవరో తెలియకుండానే.. కబ్జా చేసిన భూమిలో ఓ పెద్ద భవనం వెలుస్తోంది. మున్సిపల్ అధికారులు పలుమార్లు వెళ్లి నోటీసులు ఇచ్చినా.. ఫలితం లేదు.

ప్రస్థానం ఇలా..



- 1992 ఫిబ్రవరి 18న పుడా (పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పడింది. పుట్టపర్తి, కప్పలబండ, బ్రాహ్మణపల్లి, లోచర్ల, బీడుపల్లి, ఎనుములపల్లి గ్రామాలు ఉండేవి. మొత్తం 86.54 చదరపు కిలోమీటర్లు.
- 1996 సెప్టెంబరు 3న పుడా పేరును సుడా (శ్రీసత్యసాయి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా మార్పు చేశారు.
- 2007 ఫిబ్రవరి 28న సుడా పేరు తొలగించి 'పుడా'గా మార్చారు.
- 2022 మే 13న ఆరు మండలాలకు పుడా పరిధిని విస్తరించారు. పుట్టపర్తి నియోజకవర్గం మొత్తం (అమడగూరులోని ఐదు రెవెన్యూ గ్రామాలు మినహా) పుడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఫలితంగా 1,407.87 చదరపు కిలోమీటర్లు విస్తరించింది.
- 2022 నవంబరు 7న అమడగూరు మండలంలోని చీకిరేవులపల్లి, దండెవారిపల్లి, కరిమిరెడ్డిపల్లి, రామానంతపురం, ఎస్.కురువపల్లె రెవెన్యూ గ్రామాలను చేర్చారు. మరో 9.258 చదరపు కిలోమీటర్లు చేరడంతో పుడా మొత్తం పరిధి 1417.13 చదరపు కిలోమీటర్లకు చేరింది.

ఎంఎన్‌సీ సాకారమయ్యేనా?

- జీజీహెచ్‌కు రూ.1.02 కోట్ల యూనిట్ మంజూరు
- అనువైన స్థలం లేక ఏర్పాటులో ఆలస్యం

అనంతపురం కార్పొరేషన్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకోవడంతో గర్భిణులు, బాలింతలు, పసికందులకు పడకలు చాలక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాది జూన్‌లో మెటర్నల్ అండ్ న్యూ బార్న్ యూనిట్ (ఎంఎన్‌సీ) జీజీహెచ్‌కు మంజూరైనా.. ఆస్పత్రిలో అనువైన స్థలం లేక యూనిట్ ఏర్పాటులో ఆలస్యమవుతుండడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

జిల్లా యంత్రాంగమే స్పందించాలి!
సర్వజనాస్పత్రిలో గర్భిణులు ప్రసవించాక.. పసికందు అనారోగ్య సమస్యలతో ఉంటే ఎస్‌ఎన్‌సీయూలో ఉంచి చికిత్సలందిస్తున్నారు.బాలింతలను గైనిక్ విభాగంలో ఉంచుతున్నారు. ఈ క్రమంలో తమ బిడ్డ ఎలా ఉందోనని తల్లుల్లో ఒకవైపు ఆందోళన నెలకొంటుండగా.. మరోవైపు తల్లికి బిడ్డ దూరంగా ఉండడంతో త్వరగా కోలుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం 28 పడకలతో మెటర్నల్ అండ్ న్యూ బార్న్ యూనిట్‌ను మంజూరు చేయడం.. రూ.1.02 కోట్లు నిధులు కేటాయించడంతో కష్టాలు తప్పుతాయని అందరూ భావించారు. అయితే, ఆస్పత్రిలో గైనిక్ వార్డుకు అతి సమీపంలో యూనిట్‌ను 3000 చదరపు అడుగులతో ఏర్పాటు చేయాల్సి ఉన్నా వార్డు సమీపంలో అనువైన స్థలం లేకపోవడంతో ఆలస్యమవుతోంది. ఆస్పత్రి భాగంలో ఉన్న ఎస్‌ఎన్‌సీయూ సమీపంలో వార్డును ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా, బాలింతలు, పసికందులను పై అంతస్తులో ఏ విధంగా ఉంచుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోకుంటే ఎంఎన్‌సీ యూనిట్ రద్దయ్యే అవకాశం లేకపోలేదు. జిల్లా అధికార యంత్రాంగమైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్యాయంపై ఎక్కడికక్కడ నిలదీద్దాం

- అణగారిన వర్గాలపై దాడులను పట్టించుకోని కూటమి సర్కార్
- బంజారాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగాలి
- అఖిల భారత బంజారా సేవా సంఘం అధ్యక్షుడు బాబురావ్ చౌహాన్



బంజారాల ఆత్మీయ సభలో ప్రసంగిస్తున్న జాతీయ అధ్యక్షుడు బాబురావ్ చౌహాన్

పుట్టపర్తి అర్బన్: బంజారాలకు అన్యాయం జరిగితే ఎక్కడికక్కడ నిలదీయాలని అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏబీబీఎస్‌ఎస్) జాతీయ అధ్యక్షుడు బాబురావ్ చౌహాన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో అణగారిన వర్గాలపై అత్యాచారాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆదివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మాహీ శ్రీనివాస కళ్యాణ మంటపంలో బంజారాల ఆత్మీయ సభ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది బంజారాలు విచ్చేశారు. తొలుత సేవాలాల్ మహరాజ్, అంబేద్కర్, బిర్సా ముండా చిత్రపటాలతో పాటు ఇటీవల 'ఆపరేషన్ సిందూర్'లో వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన బాబురావ్ చౌహాన్, కర్ణాటక సామాజికవేత్త మహారాజ్, హైదరాబాద్ సునీత శంకర్‌లాల్ నాయక్, యర్రా భాస్కర్, ఏబీబీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్, పధాన కార్యదర్శి డుంగావత్ రమేష్ నాయక్ మాట్లాడారు. బంజారాలకు అఖిల భారత బంజారా సేవా సంఘం అండగా ఉంటుందన్నారు. ఇటీవల నల్లమడలో నాలుగు గ్రామాల గిరిజనుల వెయ్యి ఎకరాల భూముల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించి వారికి తిరిగి ఇచ్చే విధంగా సంఘం తరఫున పోరాడి సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. బంజారాలకు ఎవరైనా అన్యాయం చేస్తే వదిలిపెట్టేదిలేదన్నారు. బంజారాల్లో చాలామంది మద్యం, జూదానికి బానిసలయ్యారని, వాటిని వదలకపోతే జాతి క్షమించదని అన్నారు. విద్యతోనే ఏదైనా సాధ్యమవుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బంజారాలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. గుత్తి సేవాఘడ్‌లో వచ్చే కార్తీక దీపోత్సవంలో లక్షదీపార్చన వైభవంగా చేపట్టాలన్నారు. జిల్లాలో అన్ని చోట్లా అంబేద్కర్, సేవాలాల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఇతర కులాలను ఎస్టీల్లో చేరిస్తే ఒప్పుకోం
ఎస్టీల్లోకి ఇతర కులాలను కలపడానికి వీలులేదన్నారు. ఇటీవల బీసీలను ఎస్టీల్లోకి కలిపేస్తామని మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రకటించారని, అదే జరిగితే ఆయా నియోజకవర్గాల్లో 25 వేలమంది ఎస్టీలు ఏకతాటిపైకొచ్చి వారిని తిరగనీయకుండా అడ్డుకుంటారని బంజారా నేతలు స్పష్టం చేశారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలని, గిరిజన తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, సేవాఘడ్‌కు ఏటా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని, బంజారా భాష, సంస్కృతిని కాపాడాలని, అన్ని బంజారా సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావాలని, సంత్ సేవాలాల్ మహరాజ్ ట్రస్ట్‌ను ప్రక్షాళన చేయాలని, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని సభలో తీర్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, ఎస్సీ, ఎస్టీ మెంబర్ శ్రీనివాసనాయక్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసనాయక్, శివకుమార్ నాయక్, కేవీపీఎస్ అధ్యక్షుడు మల్లికార్జున నాయక్, కుల్లాయినాయక్, ఎక్సైజ్ సీఐ మల్లికా, సేవ్యానాయక్, తిరుపాల్ నాయక్, వ్యాఖ్యాత శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

పురుగు మందు పీల్చి ఉక్కిరిబిక్కిరి

- 9 మంది మహిళా వ్యవసాయ కూలీలకు అస్వస్థత



అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా వ్యవసాయ కూలీలు

గుంతకల్లుటౌన్: మొక్కజొన్న పంటలో మొవ్వ తొలుచు పురుగులను నియంత్రించడానికి ఆకుసుడుల్లో క్రిమిసంహారక మందులను వేస్తున్న తొమ్మిది మంది మహిళా వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పురుగు మందు వాసన పీల్చడంతో దాని గాఢతకు విపరీతమైన చెమటలు పట్టి, వాంతులతో చేనులోనే కళ్లు తిరిగిపడిపోయారు. ఈ ఘటన ఆదివారం అనంతపురం జిల్లా గుంతకల్లు మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ గుంతకల్లు సమీపంలోని ఐదు మోరీల వద్ద బాపట్ల జిల్లా ద్రోణాదులకు చెందిన కౌలురైతు సుబ్బరాయుడు 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం రైతు పిలవడంతో మొక్కజొన్నలో పట్టిన పురుగు నివారణకు మందు చల్లడానికి ఒక్కొక్కరికీ రూ.280 చొప్పున కూలి మాట్లాడుకుని స్థానిక మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన 19 మంది వ్యవసాయ కూలీలు ఒకే ఆటోలో కలిసి వెళ్లారు. కార్బొఫ్యూరాన్ 3 శాతం సీజీ అనే పురుగుమందు గుళికలను ఇసుకలో కలిపి ఆకుసుడుల్లో వేస్తుండగా.. మందు వాసన పీల్చడంతో వహీదాబేగం, మహాలక్ష్మి, వరలక్ష్మి, సుశీల, చంద్రకళ, శారదమ్మ, అశ్విని, రామాంజినమ్మ, నాగేశ్వరమ్మలకు విపరీతమైన చెమటలు పట్టి, వాంతులయ్యాయి. కళ్లు తిరిగి అక్కడే పడిపోయారు. కౌలురైతు, తోటికూలీలు వెంటనే వారిని ఆటోలో గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు, సిబ్బంది తక్షణ సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. పురుగు మందు గాఢత నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరడం వల్లనే అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణ అవసరమని, తరువాత పరీక్షలు నిర్వహించి వారిని డిశ్చార్జ్ చేస్తామని ఆయన తెలిపారు. కాగా..మిగిలిన పది మంది కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో వారు ఇళ్లకు వెళ్లిపోయారు.

కనీస జాగ్రత్తలు పాటించకపోవడమే కారణం
మొక్కజొన్నలో కత్తెర పురుగులను నియంత్రించడానికి వినియోగించే కార్బొఫ్యూరాన్ 3 శాతం సీజీ పురుగు మందు చాలా ప్రమాదకరమైనది. పురుగు మందు గుళికలను ఇసుకలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి. గాలి ఎదురుగా వచ్చినప్పుడు పురుగు మందు ముఖంపై పడుతుంది. అప్పుడు దానిని పీల్చడం వల్లనే అస్వస్థతకు గురవుతారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు కూడా మందు పిచికారీ చేయొద్దు, చల్లొద్దని ఎన్నిసార్లు అవగాహన కల్పించినా చాలా మంది వినడం లేదు. – లీనా వసుంధర, మండల వ్యవసాయాధికారిణి, గుంతకల్లు

విద్యార్థుల అదృశ్యంపై కేసు

చెన్నేకొత్తపల్లి: హాస్టల్‌లో చేర్పిస్తారేమోనన్న భయంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి పారిపోయారు. ఈ మేరకు విద్యార్థుల అదృశ్యంపై ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడాపురానికి చెందిన మోహన్‌రాజు కుమారుడు నాగవర్ధన్, సూరి కుమారుడు తరుణ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. హాస్టల్‌లో చేర్పిస్తామని, అక్కడ బాగా చదువుకోవాలని ఇరు కుటుంబాల్లో చెప్పారు. అయితే అక్కడకు వెళ్లడం ఇష్టం లేని విద్యార్థులు శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంతో పాటు బంధువుల ఇళ్లలో గాలించినా ఎక్కడా కనపించలేదు. దీంతో నాగవర్ధన్ తండ్రి మోహన్‌రాజు ఆదివారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నో'ట మాట' లేక

టమాట రేట్లు ఎప్పుడెలా ఉంటాయో ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక్కోసారి ధరలు ఆకాశాన్నంటి రైతులకు లాభాలు తెచ్చి పెట్టే ఈ పంట.. మరో సారి అథఃపాతాళానికి పడిపోయి కన్నీరు పెట్టిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ పారబోసేలా చేస్తోంది. కొన్ని రోజులుగా మార్కెట్లో టమాట ధరలు పూర్తిగా పడిపోయాయి. ఒక్కో బాక్సు రూ.70 నుంచి రూ. 100 వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటలను మార్కెట్‌కు తీసుకువెళ్లే వాహనం ఖర్చులు కూడా మిగలకపోవడంతో దిక్కుతోచక రోడ్ల పక్కన పారబోస్తున్నారు. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పిల్లలపల్లి వద్ద ప్రధాన రహదారిపై కుప్పలు కుప్పలుగా టమాటలను పారబోసిన దృశ్యమిది.

– బ్రహ్మసముద్రం:

పుట్టపర్తిలో పటిష్ట భద్రత

- సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్, రత్నాకర్ రాజు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి టౌన్: భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో పటిష్ట భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో రూ.1.39 కోట్ల వ్యయంతో అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదివారం గణేశ్ కూడలిలో భూమిపూజ చేశారు. మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఆర్డీఓ సువర్ణ హాజరయ్యారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ నవంబర్ 23న జరగనున్న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి వీఐపీలు, వీవీఐపీలు పది లక్షల వరకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఏపీఆర్) కెమెరాలు 10, స్టాటిక్ కెమెరాలు 169, ఇతర కెమెరాలు 47 ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామని, నవంబర్ 2లోపు వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. వీటితోపాటు డ్రోన్ కెమెరాలు కూడా వినియోగించనున్నట్లు తెలిపారు. పట్టణానికి పది కిలోమీటర్లలోపు వీటిని ఏర్పాటు చేయనున్నట్ల తెలిపారు. వీటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. అత్యాధునిక కెమెరాల సాయంతో వేడుకల్లో భద్రతా లోపాలు తలెత్తకుండా 24 గంటలూ పనిచేసే విధంగా పర్యవేక్షిస్తామన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహాయం అందించిన సత్యసాయి సెంట్రల్ ట్రస్టుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, సీఐలు శివాంజనేయులు, గోపీనాథ్‌రెడ్డితోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో విధ్వంసం



ఆయిల్‌ను పారబోసిన దృశ్యం



చిందరవందరగా పడి ఉన్న రికార్డులు

- హెచ్‌ఎంపై కోపంతో ఇద్దరు చిన్నారుల దుశ్చర్య

పుట్టపర్తి అర్బన్: కంబాలపర్తి ప్రాథమిక పాఠశాలలోకి ఇద్దరు పిల్లలు చొరబడి విధ్వంసం సృష్టించారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు తెలిపిన సమాచారం మేరకు... ఆదివారం మధ్యాహ్నం కంబాలపర్తికి చెందిన ఇద్దరు పిల్లలు పాఠశాలలోకి ప్రవేశించారు. నేరుగా హెచ్‌ఎం గదిలోకి వెళ్లి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన కోడిగుడ్లు విసిరికొట్టారు. రికార్డులు చెల్లాచెదురు చేసి పడేశారు. చిక్కీలు, బియ్యం, ఆయిల్ పారబోశారు. గదిలోంచి పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు ఏం జరుగుతోందోనని పాఠశాలలోకి వచ్చారు. తెరిచి ఉన్న తలుపులను వేసి గడియ పెట్టారు. అనంతరం ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయులు వచ్చి చూడగా లోపల ఇద్దరు పిల్లలు కనిపించారు. ఎవరని ఆరా తీస్తే ఒకరు మంగళకర పాఠశాల విద్యార్థి, మరొకరు చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి అని తేలింది. గతంలో పాఠశాలలో అసభ్యకరంగా గోడలపై రాయడంతో.. హెచ్‌ఎం గమనించి తీవ్రస్థాయిలో మందలించారు. దీన్ని మనసులో పెట్టుకుని పాఠశాలలోకి ప్రవేశించి బీభత్సం చేసినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారి తల్లిదండ్రులను పిలిపించి మందలించారు. అనంతరం పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మందలించి.. నష్ట పరిహారం కట్టేలా ఎస్‌ఐ లింగన్న పంచాయితీ చేసి పంపించారు.

క్లుప్తంగా

'వరం'లో జోరుగా కోడి పందేలు

- పోలీసుల రాకను గమనించి వాహనాలు వదిలి ఉడాయించిన జూదరులు
- 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో కోడిపందేలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో విషయం పసిగట్టిన ధర్మవరం రూరల్ పీఎస్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఏలుకుంట్ల గ్రామ సమీపంలో కొండల మధ్య కోడి పందెం ఆడుతున్నట్లుగా గుర్తించి అక్కడకు చేరుకుంటుండగా అప్రమత్తమైన జూదరులు ఉడాయించారు. పోలీసులు వెంటాడి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, పారిపోయే క్రమంలో జూదరులు వదిలి వెళ్లిన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. వాహన నంబర్ల ఆధారంగా జూదరులను గుర్తించి అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం


భర్త, కుమార్తెతో మృతురాలు గౌతమి

ఓడీచెరువు (అమడగూరు): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అమడగూరు మండలం ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టు శ్రీనాథ్, గౌతమి (23) దంపతులు. వీరికి ఏడాది వయసున్న ఓ పాప, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతమి ఉరి వేసుకుంది. విషయాన్ని గుర్తించిన వెంటనే కుటుంబసభ్యులు కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై అమడగూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తపాలా పరీక్షకు విశేష స్పందన

అనంతపురం సిటీ: స్థానిక విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్థానిక తపాలా శాఖ అధికారులు ఆదివారం నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు మొత్తం 348 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 281 మంది హాజరయ్యారు. 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రక్రియను తపాలా శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పరిశీలించారు. పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రకృతి స్వర్గం.. ఆధ్యాత్మిక ధామం

చుట్టూ ఎత్తైన కొండలు.. వినసొంపైన పక్షుల కిలకిలరావాలు... ఆకట్టుకునే పచ్చదనం... సెలయేళ్ల సవ్వడి.. వాటి మధ్యన శేషతల్పంపై పవళింపు సేవలో దర్శనమిస్తున్న ఆలూరు రంగనాయకులస్వామి. మనస్సుకు ప్రశాంతతను అందించే ప్రకృతి అందాలతో స్వర్గాన్ని తలపిస్తోంది తాడిపత్రి మండలంలోని ఆలూరు కోన క్షేత్రం. ప్రముఖ ఆధ్యాత్మిక ధామంగా వెలుగొందుతున్న ఈ ప్రాంతం తాడిపత్రి నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పుణ్య క్షేత్రానికి తాడిపత్రి బస్టాండ్ నుంచి రోజూ బస్సు సర్వీసులు ఉన్నాయి. అంతేకాక ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదానం ఉంటుంది. బస చేసేందుకు వీలుగా అద్దె గదులూ ఉన్నాయి. మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక్కసారి ఆలూరు రంగనాథుడిని సందర్శించుకుని ప్రకృతి ఒడిలో సేదదీరుదాం రండి...

– తాడిపత్రి టౌన్:


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఆలూరు రంగనాథస్వామి మూలవిరాట్


పచ్చని ఎత్తయిన కొండల నడుమ ఆలూరు కోన రహదారి


ఆలూరు కోన జలపాతం


చెట్ల నడుమ శ్రీవారి కోనేరు


ఆహ్లాదాన్ని పంచుతున్న సెలయేరు

ఆశావర్కర్లకు రూ.24 వేల వేతనమివ్వాలి

- ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి


జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

కదిరి టౌన్: ఆశా వర్కర్లకు కనీసం వేతనం రూ.24 వేలు ఇవ్వాలని కూటమి సర్కార్‌ను ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం కదిరిలోని కోనేరు సర్కిల్‌లో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆశా వర్కర్ల రెండవ జిల్లా మహాసభకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌తో కలసి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రికార్డులు సొంత డబ్బుతోనే కొనగోలు చేయాలనడం, సంబంధం లేని ఆన్‌లైన్ పనులన్నీ సొంత ఫోన్ ద్వారానే చేయాలని వేధించడం సరైంది కాదన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర మహాసభలో ఆశా వర్కర్ల సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం 30 మందితో కూడిన జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా సౌభాగ్య, కోశాధికారిగా రమాదేవి, సహాయ కార్యదర్శులుగా మమత, ముంతాజ్, చెన్నకృష్ణమ్మ, చంద్రకళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సాంబశివ, సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- ఐద్వా అఖిల భారత కోశాధికారి పుణ్యవతి


మాట్లాడుతున్న పుణ్యవతి

అనంతపురం అర్బన్: మహిళా రక్షణ చట్టాల అమలులో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఐద్వా అఖిల భారత కోశాధికారి పుణ్యవతి మండిపడ్డారు. ఫలితంగా దేశంలోను, రాష్ట్రంలోను మహిళలకు రక్షణ కరువైందన్నారు. బేటీ బచావో... బేటీ పడావో అని మాటల్లో చెబుతున్నా.. ఆచరణలో చూపించడం లేదని ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి, కోశాధికారి సావిత్రి, జిల్లా కార్యదర్శి చంద్రిక, నాయకురాలు నాగమణితో కలిసి విలేకరులతో పుణ్యవతి మాట్లాడారు. మహిళల సమస్యలపై సోమవారం నుంచి మూడు రోజుల పాటు అనంతపురం నగరంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెల రూ.1,500, వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలు వరకు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేదన్నారు. వీటిపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. మహాసభల్లో భాగంగా సోమవారం నగరంలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు.

భర్త ఇంటి ఎదుట వివాహిత ఆందోళన


భర్త ఇంటి ఎదుట బైఠాయించిన మౌనిక

సోమందేపల్లి: తనకు న్యాయం చేయాలంటూ ఓ వివాహిత తన భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు.. సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామంలోని అంబేడ్కర్ కాలనీకు చెందిన హరీష్, మౌనిక ఏడాదిగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో తన శారీరక తీర్చుకుని ఆమెను గర్భవతిని చేసిన అనంతరం హరీష్ ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, ఐదు నెలల క్రితం స్థానిక సాయిబాబా ఆలయంలో పెళ్లి జరిపించారు. అనంతరం భర్త, అత్త, మామ తనను దూరంగా ఉంచుతూ తరచూ పుట్టింటికి పంపేవారు. దీంతో మరోసారి తనను మోసం చేసేందుకు భర్త, అత్తింటి వారు ప్రయత్నిస్తుండడంతో ఆదివారం మౌనిక తన భర్త ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టింది. ప్రస్తుతం 9వ నెల గర్భంతో ఉన్న తనకు న్యాయం చేయాలంటూ వేడుకుంది.

అండగా ఉంటాం

మౌనికను వదిలించుకోవాలని చూస్తున్న భర్త హరీష్, అత్త, మామపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం మౌనికను ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలిసి మద్దతు పలికారు. చేస్తున్న ప్రయత్నం మంచిది కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న హితవు పలికారు. అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, హనుమక్క, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిగొన్న ఈత సరదా


శివకుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్: ఈత సరదా ఓ బాలుడిని బలిగొంది. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్‌ఓ కమల్‌బాషా తెలిపిన మేరకు.. బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన రుద్రన్న, బసమ్మ దంపతుల కుమారుడు శివకుమార్ (16).. గోవిందవాడ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. రెండవ శనివారం సెలవు కావడంతో తన స్నేహితులు ఆరుగురితో కలసి గ్రామ సమీపంలోని హగరి నదిలో ఉన్న కుంటలో ఈత కోసం వెళ్లాడు. అయితే శివకుమార్‌కు ఈత రాదు.. రెండు సార్లు మునిగిపోతుంగా స్నేహితులు వెలికి తీశారు. అయినా వినకుండా మూడో సారి కూడా నీటిలో దిగి గల్లంతయ్యాడు. సాయంత్రం వరకూ స్నేహితులు గాలించినా ఫలితం లేకపోయింది. విషయం పెద్దలకు తెలిస్తే తమను దండిస్తారనే భయంతో ఇంటికి చేరుకుని మిన్నకుండిపోయారు. రాత్రి అయిన శివకుమార్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి ఫిర్యాదు చేయడంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు తొలుత స్నేహితులను గట్టిగా ప్రశ్నించారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. వెంటనే గజ ఈతగాళ్లను రంగంలో దించి శివకుమార్ మృతదేహాన్ని వెలికి తీయించారు. ఆదివారం ఉదయం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

బత్తలపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలతో కలిసి తన భార్య కనిపించకుండా పోయిందని బాధితుడు ఆదివారం చేసిన ఫిర్యాదు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని వెంకటగారిపల్లి గ్రామానికి చెందిన వడ్డె హరికుమార్ పదేళ్ల క్రితం కొత్తచెరువు గ్రామానికి చెందిన తన మేనమామ కుమార్తె సాయిలక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. ఇప్పటి వరకు రెండు సార్లు భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై బత్తలపల్లి, కొత్తచెరువు పీఎస్‌ల్లో అప్పట్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే శనివారం మరోసారి భర్తతో గొడవపడి తన ఇద్దరు కుమారులు పిలుచుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త హరికుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

బత్తలపల్లి: మండలంలోని గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన బాలిక కనిపించకుండా పోయింది. వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. గుమ్మల్లకుంట ఎస్సీ కాలనీకి చెందిన నల్లబోయనపల్లి నాగలక్ష్మి బెంగుళూరులో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. పదహారేళ్ల వయసున్న కుమార్తె నయనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆరు నెలలుగా స్వగ్రామంలోని బంధువుల ఇంట్లో వదిలింది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తల్లితో మాట్లాడాలంటూ బంధువుల ఫోన్ ఇప్పించుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక, ఆ తర్వాత కనిపించకుండా పోయింది. బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న నాగలక్ష్మి ఆదివారం స్వగ్రామానికి చేరుకుని కుమార్తె ఆచూకీ కోసం ఆరా తీసింది. ఘటనపై ఆదివారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

గుంతకల్లు రూరల్: మద్యం మత్తులో ఓ యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన పార్వతమ్మ, పరమేష్ దంపతుల కుమారుడు శివకుమార్ (35)కు 11 సంవత్సరాల క్రితం పెళ్లైంది. ఓ కుమారుడు ఉన్నాడు. గుంతకల్లులోని కూరగాయల మార్కెట్‌లో ఓ వ్యాపారి వద్ద కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో మనస్పర్థల కారణంగా కొన్నేళ్ల క్రితం దంపతులిద్దరూ విడిపోయారు. తనను అడిగే వారు లేకపోవడంతో సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతూ రోజంతా మద్యం మత్తులోనే ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పని ముగించుకున్న అనంతరం మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన శివకుమార్.. చెన్నప్ప కొట్టాల రోడ్డులో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయాడు. ఆదివారం ఉదయం పొలం పనులకు వెళుతున్న రైతులు రోడ్డుపై పడి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తించి, చుట్టుపక్కల గాలించగా గుంతలో శివకుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కసాపురం పీఎస్ ఎస్ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారును ఢీకొన్న టాటా ఏస్

చింతామణి: కారును టాటా ఏస్ ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకు గాయపడ్డారు. ఈ ఘటన కర్ణాటకలోని చిక్కబళ్లాపురం జిల్లా చింతామణి తాలూకా చిన్నసంద్ర వద్ద ఆదివారం జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి తాలూకా వడ్డుమరవపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి తన కుమారుడు భానుప్రకాష్‌తో కలిసి బెంగళూరులో నివాసం ఉంటున్నాడు. కారులో స్వగ్రామానికి వెళ్తుండగా చిన్నసంద్ర వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న టాటా ఏస్ డ్రైవర్ ఓవర్‌టేక్ చేయబోతూ కారును ఢీకొనడంతో రెండు వాహనాలు రోడ్డుకు అవతల దూసుకెళ్లాయి. టాటా ఏస్ బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయింది. అందులోని తండ్రీకొడుకు గాయపడ్డారు. స్థానికులు స్పందించి వారిని ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి గోల్ షూట్ విజేత అనంత


ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి అనంత బాలికల జట్టు

కదిరి అర్బన్: ఈ నెల 11, 12వ తేదీల్లో చిత్తూరు జిల్లా నేరేబైలు గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి గోల్ షూట్ పోటీల బాలికల విభాగంలో ఉమ్మడి అనంతపురం జట్టు విజయం సాధించింది. అబ్బాయిల విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా గోల్‌షూట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆదివారం వెల్లడించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో దోపిడీ

- పైసా ఖర్చు లేకుండా ఏటా 5 వేల మంది వైద్యులయ్యే అవకాశాన్ని చిదిమేశారు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు రూరల్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో రూ.వేల కోట్ల దోపిడీకి సీఎం చంద్రబాబు తెరలేపారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలంలో చేపట్టారు. ఈ సందర్భంగా నగర శివారులోని బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొస్తే... నేడు వాటిని తన బినామీలకు కట్టబెట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారని విమర్శించారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి రూ. 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను ఆధునీకరించారని, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని, ప్రతి ఇంటికీ ఫ్యామిలీ వైద్యుడిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పేదల ఆరోగ్యం విషయంలో జగనన్న ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ క్రమంలోనే పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు, వారి పిల్లలు ఉచితంగా వైద్యవిద్య అభ్యసించేలా దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చారన్నారు. ఇందులో జగనన్న హయాంలోనే 5 కళాశాలలను నిర్మించి అడ్మిషన్లు మొదలు పెట్టి తరగతులు మొదలయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన 12 మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు వద్దంటూ కేంద్రానికి లేఖ చంద్రబాబు రాశారని, నిర్మాణాలు కూడా ఆపేయాలంటూ జీఓ ఇచ్చారన్నారు. తాజాగా వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం ముమ్మరం చేశారని మండిపడ్డారు. కొత్తగా వచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పూర్తయితే కనీసం లక్షమందికి ఉపాధి లభించేదన్నారు. పైసా ఖర్చు లేకుండా ఏటా 5 వేలమంది వైద్యులయ్యే అవకాశాన్ని చిదిమేశారన్నారు.

పాపంపేట బాధితులకు అండగా ఉంటా

పాపంపేట బాధితులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా అండగా నిలిచానని ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ సమయంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన 20 ఇళ్లను కూల్చి వేసేందుకు పరిటాల సునీత చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. అడుగడుగునా ఆ ప్రయత్నాలను అడ్డుకున్నానన్నారు. అధికారం చేపట్టిన తర్వాత కలెక్టర్‌తో తనకు అనుకూలంగా సునీత లేఖ రాయించి రాత్రికి రాత్రి ఇళ్లను కూల్చివేశారన్నారు. మళ్లీ తానే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చానని, ఇప్పుడు మళ్లీ రాచూరి బంధువులతో పరిటాల సునీత బంధువులు జీపీఏ చేయించుకుని పాపంపేట పొలంలో ఎక్కడ ఖాళీ స్థలాలుంటే అక్కడ వాలిపోతున్నారన్నారు. పాపంపేట బాధితులకు అండగా నిలబడతానన్నారు. కబ్జాదారులు పాపంపేట వీధుల్లో కనిపించకుండా తరిమికొడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాప్తాడు ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, నాయకులు భోగే గోపాల్‌రెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, ఈశ్వరయ్య, అక్కంపల్లి మాధవరెడ్డి, ఆకుల మునిశంకరయ్య, వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బత్తలపల్లి: చిన్ననాటి మిత్రులను కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు.. అందరి కళ్లలో చెప్పలేని ఆనందం.. కుటుంబ సమస్యలు, ఇతర ఇబ్బందులు, తారతమ్యాలు అన్నీ మరచిపోయారు. ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆత్మీయంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటూ చిన్ననాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఇందుకు బత్తలపల్లిలోని ప్రాథమిక పాఠశాల వేదికైంది. ఆ పాఠశాలలో 2005 నుంచి 2009 వరకు 1 నుంచి 5వ తగరతి వరకూ కలిసి చదువుకున్న వారు 15 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సందడి నెలకొంది. ఒకరి కష్టాలను పాలుపంచుకునేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి, స్వరాజ్యలక్ష్మి, బిల్లే నారాయణస్వామి, వీఎల్ఎన్ రవి, నాగభూషణ, పుల్లయ్య, సరళ, చంద్రమోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివశంకర్, గువ్వల రమేష్, నరేంద్ర, శ్యామ్, సతీష్, నారాయణస్వామి, ప్రసన్న, గణేష్, ఉస్మాన్‌బాబా, బాబావలి, సతీష్, ఉస్మాన్, షెక్షావలి, పవన్, గౌతమి, కళ్యాణి, గంగాదేవి, ఆశాబీ, రహమత్ తదితరులు పాల్గొన్నారు.


నాటి ఉపాధ్యాయులతో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అమరికలు లేకుండా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదివిన తరగతి గదులను కలియతిరుగుతూ నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు రమణారెడ్డి, నరసింహులు, వేమనారాయణ, కరీముల్లా, జెడ్.రవిను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం ఖాదర్‌వలికి పూర్వ విద్యార్థి రమేష్‌నాయక్ ల్యాప్‌టాప్, ప్రింటర్ అందజేశారు. అలాగే భవిష్యత్‌లోనూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేస్తామని పూర్వ విద్యార్థులు సందీప్‌కుమార్, కడపల శ్రీకాంతరెడ్డి, అమాన్, ఎద్దుల మహేంద్రారెడ్డి, వెంకి, శివ, రమేష్‌నాయక్, రాజేష్, ఫయాజ్, షనవాజ్, కృష్ణవేణి, అనురాధ, సుకన్య, సహజ, నిరుపమ, సుజన, లావణ్య, శ్రీకాంత్ పేర్కొన్నారు.